


బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సురేశ్ గౌడ్ – *కాచిగూడ, నవంబర్ 21*

## మాలధారులు అయ్యప్పస్వామి దర్శనం చేసుకోవాలి: ఎమ్మెల్యే



ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్, నవంబర్ 21: అయ్యప్ప మాల ధారణ చేసి దర్శనానికి వెళ్లే వారు మార్గ మధ్యలో దర్గాలో ప్రార్థనలు చేయకుండా నేరుగా శబరిమలైలోని శ్రీఅయ్యప్ప స్వామి దర్శనం చేసుకోవాలని గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ అయ్యప్ప భక్తులకు విజ్ఞప్తి చేశారు. నవంబర్ మాసం నుంచి జనవరి మాసాంతం వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అయ్యప్ప భక్తులు మాల ధారణ చేసి 41 రోజుల దీక్ష చేసిన తరువాత కేరళలోని శబరిమలై సన్నిధానంలోని అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు వెళ్తారని తెలిపారు. హిందూ ధర్మం, సంస్కృతిని కాపాడుకునేందుకు గాను దర్గాలో ప్రార్థనలు చేయకుండా నేరుగా అయ్యప్ప స్వామి వారి దర్శనం చేసుకోవాలని తెలిపారు.

## కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే


**పర్యవేక్షించిన పురపాలకశాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రియాంక**



డిప్యూటీ కమిషనర్ విద్యాధర్‌తో కలిసి సర్వేను పర్యవేక్షించిన పురపాలక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రియాంక

అబిడ్స్, నవంబర్ 21: గోషామహల్ నియోజకవర్గం జాంబాగ్ డివిజన్ పరిధిలో కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పురపాలక శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి ప్రియాంక పర్యవేక్షించారు. డివిజన్ పరిధిలోని గోషామహల్ పోలీస్ క్వార్టర్స్ ప్రాంతంలోని పలు నివాసాలను ఆమె సందర్శించి జీహెచ్ఎంసీ పద్నాల్గవ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్ విద్యాధర్‌తో కలిసి ఎన్యూమరేటర్‌లు చేస్తున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్‌లకు పలు సూచనలు, సలహాలు చేశారు. సర్కిల్ డిప్యూటీ కమిషనర్ విద్యాధర్ ద్వారా సర్వే జరుగుతున్న తీరు, ఇప్పటి వరకు సర్వే నిర్వహించిన శాతాన్ని తెలుసుకుని సర్వే త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రయత్నించాలని సూచనలు చేశారు.

## ఘన సత్కారం..



తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో గురువారం ప్రముఖ కవి, దర్శకుడు శ్రీనివాస్ దెంచనాల రచించి, దర్శకత్వం వహించి అనుసృజన చేసిన జానపద నాటక రిపర్టరీ ప్రదర్శన కొనసాగింది. చిందుయక్షగానం మాంధాత చరిత్ర కథ ఆధారంగా సాగిన ఈ అపురూప ప్రదర్శనను వీక్షించిన ప్రేక్షకులు రసానుభూతిని పొందారు. ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, తెలుగు యూనివర్సిటీ పూర్వ వీసీ తంగెడ కిషన్‌రావు హాజరై దెంచనాల శ్రీనివాస్ నాటక రచనాశైలిని ప్రశంసించి ఘనంగా సత్కరించారు.

– *తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 21*

## రైలు ఢీకొని కర్ణాటక యువకుడు మృతి

కాచిగూడ, నవంబర్ 21: పట్టాలపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ యువకుడిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాచిగూడ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన నర్సారెడ్డి కుమారుడు ఆదిత్యారెడ్డి(40) వృత్తిరీత్యా వాటర్ ప్లాంట్‌లో పని చేస్తూ, ఫలక్‌నమా ప్రాంతంలో నివాసముంటున్నాడు. గురువారం ఫలక్‌నమా రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో ఆదిత్యారెడ్డి మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

## డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేయండి

మెహిదీపట్నం, నవంబర్ 21: ప్రజలకు డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించడానికి అధికారులు డ్రైనేజీ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. గురువారం టోలిచౌకి చౌరస్తాలో డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ.నసీరుద్దీన్‌తో కలిసి పరిశీలించారు.



# రోడ్డు తవ్వారు.. పనులు మరిచారు

- తాగునీటి పైప్‌లైన్‌కు తవ్విన రోడ్డు.. ఇండ్లల్లోకి వెళ్లలేని దుస్థితి
- పట్టించుకోని జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు
- తీవ్ర ఇబ్బందుల్లో స్థానికులు



హసన్ మసీదు రోడ్డులో తవ్వి వదిలేసిన కాలువలు

అబిడ్స్, నవంబర్ 21: పైప్‌లైన్‌లు వేసేందుకు కాలువలు తవ్వి వదిలేశాడు. జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఇండ్లముందు భారీ పైపులు, ఓపెన్ కాలువలతో ప్రజలు తమ ఇండ్లలోకి కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అయితే ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. మాసబ్‌ట్యాంక్ లోని హుమాయూన్‌నగర్ మజీద్ ఈ హసన్ రోడ్డులో వరదనీటి పైప్‌లైన్‌ల కోసం 20 రోజుల క్రితం తవ్వకాలు జరిపారు. ఆయా కాలువలలో కొత్త పైపులు వేసి వాటిని పూడ్చకపోగా పాత పైపులను అక్కడే వదిలేసి చేతులు దులుపుకున్నారు. ఇండ్లముందే కాలువలు తవ్వి వదిలేయడంతో ఇంట్లోకి పోయే దారిలేక.. ఇంట్లోకి పోతే బయటకు వచ్చే దారిలేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అంతేకాక తవ్వకాలు జరిపినప్పుడు మంచినీటి పైప్‌లైన్‌లు ధ్వంసం కావడంతో హసన్ మసీదు లైన్‌లోని ప్రజలకు గత 15 రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ విషయమై జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ అధికారులు తగిన చర్యలు తీసుకుని ప్రజలకు నీటి సరఫరా పునరుద్ధరించాలని.. ప్రజలకు అసౌకర్యం కలిగించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## తలసీమియాపై ప్రజల్లో అవగాహన కల్పిస్తాం




మాట్లాడుతున్న టీఎస్‌సీఎస్ అధ్యక్షుడు చంద్రకాంత్ అగర్వాల్

అబిడ్స్, నవంబర్ 21: దేశంలో ఐదు కోట్ల మంది ప్రజలు తలసీమియా క్యారియర్లుగా ఉన్నారని, ప్రతి ఏడాది తలసీమియాతో పది నుంచి 12వేల మంది పుడుతున్నారని తలసీమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ అధ్యక్షుడు చంద్రకాంత్ అగర్వాల్ పేర్కొన్నారు. తలసెమిక్స్ ఇండియా, వాయిస్ ఆఫ్ హెల్త్ కేర్ నిర్వహించిన జాతీయస్థాయి తలసీమియా కాంక్లేవ్ ఛాలెంజెస్ అండ్ సొల్యూషన్స్‌లో పాల్గొని తలసీమియా కాంక్లేవ్ 2024 గురించి వివరించారు. ఆరోగ్య అధికారులు, వైద్య నిపుణులు ఎన్జీఓ నాయకులను కలిసి రోగుల సంరక్షణను మెరుగుపర్చడానికి, మెరుగైన నివారణ, అవగాహన, వ్యూహ రచన చేయడానికి ఆవిష్కరణలను అందిస్తుందన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌ల మెలిక పెడితే ఊరుకోం..



అబిడ్స్, నవంబర్ 21: ఏండ్ల తరబడిగా నివాసముంటున్న అపార్ట్‌మెంట్‌లకు ఇప్పుడు ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసుకోవాలని నోటీసులు ఇచ్చి వారిని ఇబ్బంది పెట్టవద్దని, అలా చేస్తే ప్రజల పక్షాన నిలిచి సీఎండీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ హెచ్చరించారు. బేగంబజార్ డీఈ ఫర్హత్ అలిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఏండ్ల కింద నిర్మించిన భవనాలు, కాంప్లెక్స్ వారు ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసుకోవాలని నోటీసులు జారీ చేయడం తగదన్నారు. ఈఎంఐలు కడుతూ ఫ్లాట్‌లను కొనుగోలు చేసిన వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ట్రాన్స్‌ఫార్మర్ల పేరుతో అదనపు భారం వేయాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో దీపక్‌సింగ్, విజయ్, నరేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 7న రాష్ట్రవ్యాప్త ఆటోల బంద్



అభివాదం చేస్తున్న ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ నేతలు

రవీంద్రభారతి, నవంబర్ 21: గత 11 ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ డిసెంబర్ 7వ దీన రాష్ట్రవ్యాప్తంగా ఆటో బంద్‌ను నిర్వహిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో తమ మానిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం దుర్మార్గం అని మండిపడ్డారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బి.వెంకటేశం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించకుండా మోసం చేసిందని విమర్శించారు. పెరిగిన పెట్రోల్, డీజిల్,గ్యాస్ ధరలకు అనుగుణంగా ఆటోమీటర్ చార్జిలను పెంచాలని, మహాలక్ష్మి పథకం వల్ల ఆర్థికంగా నష్టపోయిన ఆత్మహత్య చేసుకున్న ఆటోడ్రైవర్ల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 40 మంది ఆటోడ్రైవర్లు చనిపోయారని, బాధిత కుటుంబాలకు వెంటనే ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.శ్రీకాంత్, వి.ప్రవీణ్, ఎంఎ సలీం, ఎ.సత్తిరెడ్డి, వి.మారయ్య, వీఎస్ బోస్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఎంఎస్ టెండర్‌ను రద్దు చేయాలి

అబిడ్స్, నవంబర్ 21: జలమండలిలో ప్రవేశపెట్టిన ఏఎంఎస్ టెండర్లతో నిరుపేద కాంట్రాక్టర్‌లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నందున ఆ విధానాన్ని రద్దు చేయాలని కాంట్రాక్టర్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌లను కోరారు. గాంధీ భవన్‌లో కాంట్రాక్టర్ల ప్రతినిధి పొల్కం శ్రీనివాస్ కలిసి ఏఎంఎస్ టెండర్ ద్వారా ప్రజలు నష్టపోతున్నారని వివరించారు. అనంతరం పొల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆ విధానాన్ని రద్దు చేస్తే రూ.50 లక్షల టెండర్‌ను మెయింటెనెన్స్‌లో 25 లక్షలకే చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. గత తెలుగుదేశం, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉన్న విధానాన్ని తిరిగి తీసుకురావాలని కోరారు. ఈ విషయంలో కాంట్రాక్టర్‌లకు న్యాయం జరిగేలా చూస్తామని వారు హామీనిచ్చినట్లు పొల్కం శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.ప్రవీణ్‌కుమార్, విక్రమ్, వినయ్‌రాజ్, ఆదిమూలం శంకర్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన బొడ్రాయి పునః ప్రతిష్ఠాపన



అంబర్‌పేట బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న భక్తులు



బొడ్రాయికి పూజలు చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ ఉమ, గౌతంరావు, రమేశ్‌యాదవ్

అంబర్‌పేట, నవంబర్ 21: అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన అంబర్‌పేట బొడ్రాయి(నాభిశిల) పునః ప్రతిష్ఠాపన మహోత్సవాలు గురువారం బోనాల సమర్పణతో ముగిశాయి. తెల్లవారుజామున పొలిమేర బలి కార్యక్రమం, ఆరు గంటలకు పోతరాజు వేషాధారణతో గావు పట్టడం, తొమ్మిది గంటలకు తీర్థప్రసాదాల వితరణ జరిగింది. బైండ్ల పూజారులు పూజలు చేశారు. ఈ సందర్భంగా పాతఅంబర్‌పేట గ్రామంలో ప్రతి ఇంటికి మామిడి తోరణాలు కట్టి అలంకరించారు. గడపలకు పసుపు, కుంకుమలు రాశారు. ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బొడ్రాయికి ఒడిబియ్యం, బోనాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేసి బొడ్రాయిని దర్శించుకున్నారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి బొడ్రాయి పునఃప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రతి గ్రామంలో గ్రామ దేవతతోపాటు బొడ్రాయికి కూడా పూజ చేసే సంప్రదాయం ఉందన్నారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పూజలు చేయగా.. మాజీ కార్పొరేటర్ కె.పద్మావతి డీపీరెడ్డి బోనం సమర్పించారు. దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**బొడ్రాయి దర్శనం**

కాచిగూడ: అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా గురువారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, నగర ఉపాధ్యక్షుడు కన్నె రమేశ్ యాదవ్, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

## పారిశ్రామికవేత్తలకు శిక్షణ ఇవ్వడమే లక్ష్యం

రవీంద్రభారతి,నవంబర్ 21: జనవరి 2026 నాటికి లక్ష మంది యువ పారిశ్రామికవేత్తలకు శిక్షణ ఇవ్వడం, దేశవ్యాప్తంగా 20 కోట్ల మంది విద్యార్థులను శక్తివంతంగా చేసేలా ఒక ఉద్యమాన్ని చేపట్టడం ఎంతో అభినందనీయమని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రత్యేక కార్యదర్శి విశ్రాంత ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రా అన్నారు. గురువారం లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో లీడ్ ఇండియా ఎంట్రప్రెన్యూర్‌షిప్(లైఫ్) మిషన్ కార్యక్రమానికి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా అజయ్ మిశ్రా, లీడ్ వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ ఎన్వీ సుదర్శన్ ఆచార్య, విశ్రాంత ఐఏఎస్ అధికారి జనార్దన్‌రెడ్డి విచ్చేసి జ్యోతిప్రజ్వలనం చేసి ప్రారంభించారు. అజయ్ మిశ్రా మాట్లాడుతూ.. 20 కోట్ల మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడం గొప్ప యజ్ఞం అని కొనియాడారు. లీడ్ ఇండియా సభ్యుడు సుదర్శన్ ఆచార్య మాట్లాడుతూ.. తాము చేస్తున్న ఈ ప్రయత్నం విద్యార్థులకు మార్గనిర్దేశం ఇవ్వడంతోపాటు దేశం యొక్క ఆర్థిక వ్యవస్థను వేగవంతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ట్రస్మా అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి, శ్రేయ ఇంజినీరంగ్ కళాశాల కార్యదర్శి రవీంద్రనాథ్, శ్రీధర్,డా. పి.ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.



లీడ్ ఇండియా విక్టరీని చూపుతున్న అజయ్ మిశ్రా, సుదర్శన్ ఆచార్య, జనార్దన్‌రెడ్డి

## మైరావణ వధ -తోలుబొమ్మలాట



మైరావణ వధ–తోలుబొమ్మలాట ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు

రవీంద్రభారతి, నవంబర్ 21: కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్,కిన్నెర ఎడ్యుకేషనల్ ట్రస్ట్, తెలంగాణ ప్రభుత్వం, భాషా సంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ 47వ వార్షికోత్సవం గురువారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ హైకోర్టు జస్టిస్ కె.లక్ష్మణ్, పూర్వ ఉపకులపతి గంగిశెట్టి లక్ష్మీనారాయణలు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కె.ప్రసాద్ దర్శకత్వం వహించిన మైరావణ వధ–తోలుబొమ్మలాట చితంబరరావు దర్శకత్వం వహించిన సుందరకాండ తోలుబొమ్మలాట నాటక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. అంతరించి పోతున్న ప్రాచీన కళలను పరిరక్షించుకోవాలి ఆయన సూచించారు. కార్యక్రమంలో కిన్నెర ఆర్ట్స్ థియేటర్ అధినేత ముద్దాలి రఘురామ్, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

## కురుమల అభ్యున్నతికి కృషి : ఎమ్మెల్సీ



ఎమ్మెల్సీ, తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు యెగ్గె మల్లేశంను సన్మానించిన ఉప్పల్ కురుమ సంఘం నాయకులు

అబిడ్స్, నవంబర్ 21: కురుమల అభ్యున్నతికి నిరంతరం పాటు పడుతున్నట్లు ఎమ్మెల్సీ, తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు యెగ్గె మల్లేశం పేర్కొన్నారు. ఉప్పల్ కురుమ సంఘం నాయకులు యెగ్గె మల్లేశంను ఆయన నివాసంలో కలిసి కురుమల గొంగడి రుమాలుతో సన్మానించి ఈనెల 25వ తేదీన ఉప్పల్ కురుమ సంఘం ఆధ్వర్యంలో జరిగే కల్యాణ మండపం, కురుమ విద్యార్థి హాస్టల్ నిర్మాణానికి రావాలని ఆహ్వానించారు. అనంతరం యెగ్గె మల్లేశం మాట్లాడుతూ.. కల్యాణ మండపం, కురుమ విద్యార్థి హాస్టల్ నిర్మాణానికి తన పూర్తి సహాయ సహకారాలను అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గొరిగె మల్లేశ్, కురుమ జోన్ వైస్ ప్రెసిడెంట్ పెద్ద మల్లేశ్ కురుమ, వెలుగు గుట్ట శ్రీమల్లిఖార్జున స్వామి దేవాలయ చైర్మన్ జన్ని రఘు, ఉప్పల్ కురుమ సంఘం అధ్యక్షుడు చిందం వెంకటేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బర్ల కృష్ణ, సలహాదారులు గొరిగె ఐలయ్య, మోటె నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## సేవా భావంతో పనిచేసినప్పుడే గుర్తింపు



వృద్ధులకు అన్నదానం చేస్తున్న బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, తదితరులు

కాచిగూడ, నవంబర్ 21: సేవా భావంతో పని చేసినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, సంఘ సేవకుడు గుజ్జ సత్యం పుట్టినరోజు సందర్భంగా గురువారం నగరంలోని పలు వృద్ధాశ్రమాల్లో అన్నదానాలు, వికలాంగులకు నిత్యావసర వస్తువులు, పేద విద్యార్థులకు ఉచితంగా నోట్స్‌బుక్స్, పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు, పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. సామాజిక సేవా భావంతో ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో యువత పని చేయాలని పిలుపునిచ్చారు. యువతలో సామాజిక బాధ్యతను పెంచడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో చౌటుపల్లి సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును గౌరవించాలి



నిరాహార దీక్ష చేస్తున్న మాదిగ మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్‌మాదిగ తదితరులు

కాచిగూడ, నవంబర్ 21: ఎస్సీ వర్గీకరణపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను వెంటనే జారీ చేయాలని తెలంగాణ మాదిగ మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్‌మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణకై ఆర్టికల్ 341ను సవరిస్తూ పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించాలని కోరుతూ దండోరా ధర్మపోరాట ఆధ్వర్యంలో గురువారం బర్కత్‌పురలోని సమాజిక భవన్ మహాకూటమి రాష్ట్ర కార్యాలయంలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఆమరణ నిరాహార దీక్షకు బాలకిషన్, దయానంద్, రాజలింగం, కృష్ణమూర్తి, సూర్యప్రకాశ్, కె.శ్రీనివాస్, బిషప్ స్వామిదాస్, మోజేష్, సనవుల్లాఖాన్, జంగన్నగౌడ్, కల్యాణ్‌ప్రేమ్‌రాజ్, లింగయ్య.రామదాసు మాదిగ,పరమేశ్‌మాదిగ,సుజయ, మహేశ్‌యాదవ్,సుధాకర్‌మాదిగ, కుల సంఘాలు, ప్రజా సంఘాలు సంఘీభావం పలికారు.

## ముగిసిన బిలాల్ టైగర్స్ క్రికెట్ టోర్నీ



అంబర్‌పేట డివిజన్ వాటర్‌వర్క్స్ మైదానంలో బిలాల్ టైగర్స్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గురువారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ హాజరై ఫైనల్ మ్యాచ్ జట్టు విజేతలకు బహుమతులు, కప్‌ను అందజేశారు. క్రికెట్ టోర్నీ నిర్వహించిన నిర్వాహకులను కార్పొరేటర్ అభినందించారు.– *గోల్నాక, నవంబర్ 21*

## ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం



ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగాపురలో సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఫిషర్‌మెన్ చైర్మన్ మెట్టు ప్రసాద్ కేక్‌కట్ చేసి సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొప్పు పద్మ, వినోద్, మెట్టు రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు. – *అబిడ్స్, నవంబర్ 21*

## విద్యార్థులు చదువుతోపాటు సమాజాన్ని చదవాలి

సుల్తాన్‌బజార్,నవంబర్ 21: విద్యార్థులు చదువుతో పాటు సమాజాన్ని చదవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేశ్ పేర్కొన్నారు. గురువారం ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిజాం కళాశాలలో సభ్యత్వ నమోదు కా ర్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతోపాటు సమాజాన్ని సైతం చదవాలన్నారు. నేటి సమాజంలో విద్యను వ్యాపారం చేస్తూ ప్రభుత్వ విద్యను, విశ్వ విద్యాలయాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. విద్యార్థులందరూ ఏఐఎస్ఎఫ్‌లో సభ్యులుగా చేరి తమ సమస్యలపై పోరాడాలన్నారు. విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్ జెండా ఎళ్లవేళలా అండగా ఉంటుందని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్, సహాయ కార్యదర్శి అనిల్‌కుమార్, నిజాం కళాశాల కన్వీనర్ సుశాంత్, నాయకులు జ్ఞానేశ్, శివ, శిరీష, శ్వేత, హరీశ్ పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యలు పరిష్కరించండి

మెహిదీపట్నం, నవంబర్ 21: నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్‌లో తాగునీటి సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్ జలమండలి ఎండీ అశోక్‌కుమార్‌రెడ్డిని కోరారు. నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ ఆదేశాలతో గురువారం మల్లేపల్లి కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్ జలమండలి ఎండీ.అశోక్‌కుమార్ రెడ్డిని కలిసి మల్లేపల్లిలో తాగునీటి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మల్లేపల్లిలో తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని కోరారు.

**ప్రజల అభివృద్ధికి నిరంతరం కృషి**



ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ అభివృద్ధిని అందించడానికి కృషి చేస్తున్నామని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. గురువారం నాంపల్లి నియోజకవర్గంలోని పలు డివిజన్లలో ఎమ్మెల్యే పర్యటించారు. స్థానికులతో పలు అంశాలపై చర్చించిన ఎమ్మెల్యే వారికి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు.

**సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్వోసీల అందజేత**

సీఎం రిలీఫ్ ఫండ్‌లో మంజూరైన నిధులకు సంబంధించి ఎల్వోసీలను గురువారం ఎంఐఎం పార్టీ ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్‌ఖాద్రి లబ్ధిదారులకు అందించారు. చార్మినార్‌కు చెందిన సిద్రాబేగంకు రూ.2లక్షలు, కందికల్‌గేట్‌కు చెందిన శ్రీనివాస్‌కు రూ.75వేల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్వోసీలను ఎమ్మెల్సీ మిర్జా రహమత్‌బేగ్ ఖాద్రి అందించారు.